సాక్షి సంగారెడ్డి

మంగళవారం ; 10 ; జనవరి ; 2023



నిబంధనలు అతిక్రమించొద్దు

ఫుడ్ సేఫ్టీ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆహార తనిఖీ సిద్దిపేట జిల్లా అధికారి కృష్ణమూర్తి హెచ్చరించారు. నిల్వ ఆహారాన్ని తొలగించాలన్నారు. 8లో



శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట

శాంతి భద్రతల పరిరక్షణకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 8లో



నత్తనడకన నిర్మాణ పనులు

కందిలో మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలతో పాటు కళాశాల, తదితర భవనాల నిర్మాణ పనులు నాలుగేళ్లుగా కొనసా....గుతూనే ఉన్నాయి. 9లో

న్యూస్‌రీల్

టీబీ రహిత జిల్లాగా మారుద్దాం



టీబీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంగారెడ్డి టౌన్: టీబీ రహిత జిల్లాగా మారుద్దామని, దీనికి అందరూ సహకరించాలని టీబీ నియంత్రణ విభాగం జిల్లా కోఆర్డినేటర్ అరుణ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో సోమవారం బ్రేకింగ్ ది బర్రీయర్స్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె టీబీ లేని జిల్లాగా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. టీబీ రాకుండా ముందస్తు జాగ్రత్తలు, వచ్చిన తర్వాత చికిత్స గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రేకింగ్ ది బర్రీయర్స్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నరసింహులు మాట్లాడుతూ టీబీ విముక్తి జిల్లా కోసం అందరూ టీబీపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, పొగాకు నియంత్రణ విభాగం స్క్వాడ్ విష్ణువర్ధన్ రెడ్డి, ఐటీఐ కాలేజ్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

మైలాన్ పరిశ్రమ ఎదుట సీఐటీయూ ధర్నా



పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మైలాన్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు యాజమాన్యం రూ.50 లక్షల పరిహారాన్ని అందించాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజయ్య డిమాండ్ చేశారు. జిన్నారం మండలంలోని గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని మైలాన్ పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు కార్మికులు మృతి చెందడంతో సోమవారం సీఐటీయూ నాయకులు పరిశ్రమ ఎదుట బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజయ్య మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే కార్మికులు మృతి చెందారన్నారు. యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను కోరారు. కార్మికుల సంక్షేమాన్ని యాజమాన్యాలు పూర్తిగా విస్మరించాయని ఆరోపించారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కంది(సంగారెడ్డి): కంది మండలంలోని చిమ్నాపూర్‌లో ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వరిలో వెదజల్లే సాగు పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. వరి సాగుకు నారుమళ్లు వేయడానికి బదులుగా పొలంలో నేరుగా విత్తనాలను వెదజల్లే పద్ధతి రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణగౌడ్ తెలిపారు. ఈ పద్ధతితో సాగు ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడి కూడా అధికంగా వస్తుందన్నారు. పంటల సాగులో నూతన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి పంటలు సాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడీ మనోహర, ఏఓ చైతన్య, సర్పంచ్ ప్రమీల ప్రకాష్, ఏఈఓ కృష్ణవేణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి బాడ్మింటన్ టోర్నీ

నారాయణఖేడ్: మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లో ఈనెల 13, 14 తేదీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి డబుల్స్ షటిల్ బాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ బాధ్యులు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు కామారెడ్డి జిల్లాలోని పిట్లం, బాన్సువాడ, కర్ణాటకలోని ఔరాద్, మహారాష్ట్రలోని డెగ్లూర్ టీంలను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలైన జట్లకు షీల్డ్‌తోపాటు ప్రథమ బహుమతిగా రూ.7,777, ద్వితీయ బహుమతిగా రూ.5,555, తృతీయ బహుమతిగా రూ.3,333, చతుర్థ బహుమతిగా రూ.2,222 అందజేయనున్నట్లు వివరించారు.

రేషన్.. పంపిణీలో జాప్యం

10వ తేదీ వచ్చినా తెరుచుకోని చౌకధరల దుకాణాలు

- ఉచిత పంపిణీపై ఎటూ తేల్చని రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో 3.78 లక్షల కార్డుదారులు



సంగారెడ్డిలోని ఓ రేషన్ షాపు ఎదుట లబ్ధిదారుల క్యూ(ఫైల్)

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రేషన్ బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతోంది. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా, పదో తేదీ వచ్చినా రేషన్‌షాపుల్లో బియ్యం పంపిణీ ప్రారంభం కాలేదు. ఇప్పటికే అన్ని రేషన్‌షాపుల్లో బియ్యం నిల్వలు డంప్ చేసినప్పటికీ పంపిణీ మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో నిరుపేద రేషన్‌కార్డుదారులు బియ్యం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి చూస్తున్నామని పౌరసరఫరాల శాఖ వర్గాలు చెబుతున్నాయి.

‘ఉచితం’పై తర్జనభర్జన

కరోనాతో ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలందరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. ఒక్కో వ్యక్తికి ప్రతినెలా పది కిలోల చొప్పున కుటుంబంలో ఎంత మంది సభ్యులుంటే అన్ని పది కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. అయితే ఈ ఉచిత బియ్యం పంపిణీని ఈ ఏడాది డిసెంబర్ వరకు కొనసాగిస్తామని కేంద్రం ప్రకటించింది. తన వాటా కింద పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నిర్ణయం ప్రకటించలేదు. ప్రతినెలా ఇస్తున్న ఉచిత బియ్యంలో తన వాటా కొనసాగించాలా? వద్దా? అనే అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ కారణంగా ఈ నెల(జనవరి మాసానికి) సంబంధించి బియ్యం పంపిణీని అధికార యంత్రాంగం ప్రారంభించలేదు.

12,988 మెట్రిక్ టన్నులు

ఆహార భద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ ఇలా అన్నీ కలిపి జిల్లాలో 3.78 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల్లో 12.38 లక్షల మంది సభ్యులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 668 రేషన్ షాపుల ద్వారా ఒక్కొక్కరికి పది కిలోల చొప్పున ప్రతినెలా 12,988 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు అన్ని రేషన్ షాపుల్లో బియ్యం నిల్వలను ఉంచారు. ఉచిత బియ్యం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని వేచి చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పంపిణీ ప్రారంభిస్తామని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

తప్పని ఎదురు చూపులు

రేషన్ బియ్యం కోసం కార్డుదారులు ఎదురు చూస్తున్నారు. అయితే చాలామట్టుకు రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు వాటిని తినడం లేదు. బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కానీ నిరుపేదలు మాత్రం ఈ బియ్యం కోసం ఎదురు చూస్తున్నారు. అన్ని రేషన్‌షాపుల్లో బియ్యం నిల్వలు సిద్ధంగా ఉంచామని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పంపిణీ ప్రారంభిస్తామని పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజర్షిషా

జిల్లా అభివృద్ధికి సహకరించండి

అదనపు కలెక్టర్ రాజర్షిషా

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ నిధులు అందజేసి జిల్లా అభివృద్ధికి సహకరించాలని అదనపు కలెక్టర్ రాజర్షిషా పరిశ్రమల ప్రతినిధులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని క్లస్టర్ 3, క్లస్టర్ 4లోని వివిధ పరిశ్రమల ప్రతినిధులు, సీఎస్ఆర్ నిధుల జిల్లా పర్యవేక్షణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో వచ్చిన ప్రాఫిట్, సీఎస్ఆర్ కింద జిల్లాలో, జిల్లా బయట, రాష్ట్రంలో, రాష్ట్రం బయట వెచ్చించిన నిధులకు సంబంధించి సరైన సమాచారం, సంతకంతో కూడిన కాపీలను ఆయా కంపెనీలు సంబంధిత పర్యవేక్షక కమిటీ అధికారులకు అందించాలని సూచించారు. టర్నోవర్‌లో రెండు శాతం సీఎస్ఆర్ కింద నిధులను కలెక్టర్ ఖాతాలో జమ చేయాలన్నారు. కంపెనీస్ యాక్ట్, సీఎస్ఆర్ గైడ్‌లైన్స్‌ను విధిగా పాటించాలని కోరారు. సీఎస్ఆర్ నిధులతో ఏ పనులు చేపట్టినా సమాచారాన్ని జిల్లా అడ్మినిస్ట్రేషన్‌కు ముందుగా తెలియజేసి, కలెక్టర్ అప్రూవల్ తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో సీపీఓ మనోహర్, ఆయా కంపెనీల ప్రతినిధులు, సీఎస్ఆర్ నిధుల పర్యవేక్షణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవతోనే నాయకులకు గుర్తింపు

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): ప్రజా సేవతోనే ప్రజాప్రతినిధులకు మంచి గుర్తింపు లభిస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్హేర్ మండల పరిషత్‌లో కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ప్రభుత్వం పటిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాంసింగ్, ఎంపీపీ గుర్రపు సుశీల అంజయ్య, జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎంఏ.ఘని, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ సంగ్రామ్, డాక్టర్ జేబా షహమీమ్, సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, కిష్టారెడ్డి, శ్రావణ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, సంగారెడ్డి, నాయకులు ఉప్పరి అంజయ్య, పెరుమాండ్ల బాలయ్య, వెంకట్‌రెడ్డి, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

చిరుత సంచారంపై ఆధారాలు లేవు



చిరుత సంచారంపై ఆధారాలు సేకరిస్తున్న బీట్ అధికారి

రాయికోడ్(అందోల్): మునిపల్లి మండలంలోని తాటిపల్లి, చీలపల్లి, గార్లపల్లి, పెద్దలోడి, పిల్లోడి, రాయికోడ్ మండలం హస్నాబాద్, సంగాపూర్ గ్రామాల్లో చిరుత సంచరిస్తున్నట్లు తమకు ఎలాంటి ఆధారాలు లభించలేదని బీట్ ఆఫీసర్ ఇనాయత్ అలీ తెలిపారు. సోమవారం రాయికోడ్ మండలం సింగితం, సంగాపూర్ గ్రామాల శివారు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం.. అటవీ ప్రాంతాల్లో చిరుత సంచారంపై ఆధారాలను సేకరించామన్నారు. ఇక్కడా ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. చిరుతను పోలిన ఇతర జంతువులను చూసి పలువురు పొరబడి ఉంటారని అభిప్రాయపడ్డారు. పుకార్లను ప్రజలు నమ్మవద్దన్నారు. ప్రజలు గ్రూపులుగా పొలం పనులకు వెళ్లాలని ఆందోళన చెందవద్దని సూచించారు. సోషల్ మీడియాలో ఫేక్ ఫొటోలు షేర్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని కోరారు. ఝరాసంగం మండలం గుంతమర్పల్లి శివార్లలోనూ పర్యటించి ప్రజలకు సూచనలు చేశామన్నారు. అటవీ శాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. చిరుత సంచరిస్తున్నట్లు ఖచ్చితమైన సమాచారం, ఆధారాలు లభిస్తే అన్ని చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.



సమావేశంలో అదనపు కలెక్టర్, ఇతర శాఖల అధికారులు

సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

జిన్నారం(పటాన్‌చెరు): అన్నారం గ్రామ పరిధిలోని 261 సర్వే నంబర్‌లోని సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతామని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామ పరిధిలోని 251 సర్వే నంబర్‌లో భూమి కబ్జాకు గురికావటంతో పాటు కొంత మంది ఆక్రమిస్తున్నారని ఇటీవల సర్పంచ్ తిరుమలవాసు మంత్రి కేటీఆర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించి అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ నగేశ్, డీపీఓ సురేశ్‌మోహన్, తహసీల్దార్ సుజాత, డీఎల్‌పీఓ సతీశ్ సోమవారం అన్నారం పంచాయతీ కార్యాలయంలో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. భూములు కబ్జా అవుతున్న తీరుపై అదనపు కలెక్టర్ గ్రామస్తులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 261 సర్వే నంబర్‌లోని భూమిని పూర్తి స్థాయిలో సర్వే చేస్తామన్నారు. రైతులకు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు తగిన న్యాయం చేస్తామని, కబ్జా భూములను గుర్తించి కాపాడుతామని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు. తనపై వచ్చిన ఆరోపణల విషయంలో కూడా పూర్తి స్థాయి విచారణ జరిపించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ తిరుమలవాసు అదనపు కలెక్టర్‌ను కోరారు.

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం



సమావేశంలో అధికారులు, పాలకమండలి సభ్యులు

ఝరాసంగం(జహీరాబాద్): మహా శివరాత్రిని పురస్కరించుకొని కేతకీ సంగమేశ్వర ఆలయంలో నిర్వహించే నవాహ్నిక బ్రహ్మోత్సవాలను గతంలో కంటే అత్యంత వైభవంగా నిర్వహిస్తామని కేతకీ ఆలయ ఈఓ శశిధర్, పాలక మండలి చైర్మన్ నీల వెంకటేశం పేర్కొన్నారు. సోమవారం ఝరాసంగం కేతకీ ఆలయ ఆవరణలో ఆలయ చైర్మన్ అధ్యక్షతన పాలకమండలి సభ్యులతో కలిసి బ్రహ్మోత్సవాలపై ఆలయ ఈఓ సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల్లో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు గతంలో కంటే అధికంగా కేతకీ ఆలయానికి భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. క్యూలైన్ల ఏర్పాటు, తాగు నీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన తాత్కాలిక చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ టెండర్లను ఎంపిక చేశారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు ఎంపీ నాగన్న, నాగేశ్వర్ సజ్జన్, లక్ష్మయ్య, సంగన్న, విఠల్ రెడ్డి, బస్వరాజ్ పటేల్, మొగులయ్య, సిద్ధన్నపాటిల్, మల్లికార్జున్ పాటిల్, నారాయణ రెడ్డి, బసయ్య స్వామి, ఆలయ అధికారి శివకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘నిమ్జ్’ నిర్వాసితులకు న్యాయం చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

సంగారెడ్డి టౌన్: నిమ్జ్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు సరైన న్యాయం చేయాలని భూ నిర్వాసితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోగడంపల్లి ఆశప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ జన సమితి, భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్జ్ భూ నిర్వాసితులపై ప్రభుత్వం చట్ట విరుద్ధమైన ప్రకటన చేస్తూ బలవంతపు భూసేకరణ చేయాలని చూస్తోందని ఆరోపించారు. గత నెల పదో తేదీన నిమ్జ్ భూ నిర్వాసిత గ్రామాలకు నోటీసులు ఇచ్చిందని తెలిపారు. గతంలో ఇచ్చిన నోటీసులకు సంబంధించి కలెక్టర్‌కు సమాధానం ఇచ్చినాకలెక్టర్ నుంచి ఎలాంటి సమాధానం లేకుండానే మరో నోటిఫికేషన్ వచ్చిందన్నారు. దీంతో రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. నిమ్జ్ ప్రారంభం నుంచి రాష్ట్ర ప్రభుత్వం అబద్ధపు ప్రకటనలు చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి, నిమ్జ్ భూనిర్వాసితుల సంఘం ఉపాధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు శివారెడ్డి, రాజనర్సింహ, గోపాల్, మహమ్మద్ గౌస్, మహమ్మద్ మక్బూల్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

- అదనపు కలెక్టర్లు రాజర్షిషా, వీరారెడ్డి
- ప్రజావాణికి 79 అర్జీలు


సంగారెడ్డి టౌన్: ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు రాజర్షిషా, వీరారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. వివిధ శాఖలకు కేటాయించిన కౌంటర్లలో ప్రజలు వారి సమస్యలకు సంబంధించిన అర్జీలను సంబంధిత అధికారులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్జీలను వెంటవెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చేయరాదన్నారు. అన్ని శాఖల అధికారులు వచ్చిన అర్జీలు, పరిష్కరించినవి, పెండింగ్లో ఉన్న వివరాలను సంబంధిత రిజిస్టర్లలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ప్రజావాణికి వివిధ సమస్యలపై 79 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా, మిగిలినవి డబుల్ బెడ్రూం ఇళ్లు, పింఛన్లు, స్వయం ఉపాధికి రుణం మంజూరు, ఉపాధి కల్పించాలని, తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ, పాల్గొన్నారు.

సర్వే చేయించండి



తన భూమిని సర్వే చేసి 3.27 ఎకరాలను రికార్డుల్లో చూయించాలని కోహీర్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన చింతల గట్టు లక్ష్మమ్మ ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంది. వీలైనంత త్వరగా తన సమస్యను పరిష్కరించాలని వేడుకుంది.

ప్రభుత్వ భూమిని కాపాడండి



సిర్గాపూర్ మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తుడు తుకారాం ప్రజావాణిలో దరఖాస్తు ఇచ్చాడు. గ్రామ శివారులో సర్వే నంబరు 166లో 15 ఎకరాల 16 గుంటల భూమిని గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు అప్పటి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రికార్డుల్లో అక్రమంగా తమ పేర్లను ఎక్కించుకున్నారు. పాత రెవెన్యూ రికార్డులపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ చేపట్టి కబ్జా నుంచి భూమిని కాపాడి గ్రామ అభివృద్ధికి సహకరించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు.

ఎన్‌ఓసీ ఇప్పించండి



తన పట్టా భూమికి ఎన్‌ఓసీ ఇప్పించాలని కోరుతూ పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన రాములు ప్రజావాణిలో అర్జీ అందజేశాడు. కొన్ని నెలలుగా ఎన్‌ఓసీ ఇప్పించాలని కోరుతూ ఇంజనీరింగ్ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదని, దీంతో ఎవరికీ భూమిని అమ్మలేకపోతున్నానని, అధికారులు ఎన్‌ఓసి ఇప్పించాలని ప్రజావాణిలో కోరారు.

చెరువును రక్షించండి

‘పటాన్‌చెరు మండల పరిధిలోని లక్డారం గ్రామంలో నూతనంగా కేఎస్ఆర్ క్రషర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో చెరువులో నీరు కాలుష్యం కావడంతో పాటు చెరువు అన్యాక్రాంతం అవుతోంది. చెరువు కింద సుమారు ఉన్న 500 ఎకరాల భూమి బీడుగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే కుంటకట్టను ధ్వంసం చేసి రోడ్డు ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసే క్రషర్‌ను వేరే ప్రాంతానికి మార్చాలి.’ అని లక్డారం గ్రామ రైతులు ప్రజావాణికి వచ్చి అర్జీ సమర్పించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కలెక్టర్ డాక్టర్ శరత్

పటాన్‌చెరు: రెవెన్యూకు సంబంధించిన సమస్యలపై దళారులను నమ్మి మోసపోవద్దని, నేరుగా మీసేవ కేంద్రాల్లో దరాఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శరత్ సూచించారు. సోమవారం అమీన్‌పూర్‌లోని సుల్తాన్‌పూర్ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. గ్రామంలో ప్రత్యేకంగా రెండు మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వే నంబర్ 30లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ధరణితో భూరికార్డుల కంప్యూటరీకరణ పూర్తయిందని, లోపాలను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేకంగా మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. సుల్తాన్‌పూర్, దాయర గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను స్థానికులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పట్టాదారులతో పాటు ఇతరులు అనే పదాలు పట్టాదార్లను ఇబ్బంది పెడుతుందని, ఒకే సర్వే నంబర్‌లోని వివాదాలతో ఇతర పట్టాదార్లు ఇబ్బంది పడుతున్నారని, ఆ భూములన్నింటినీ వివాదస్పద భూములుగా చూపుతుండటంతో సంబంధం లేని పట్టాదార్లు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వివరించారు. కార్యక్రమంలో దాయర సర్పంచ్ భాస్కర్‌గౌడ్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, తహసీల్దార్ దశరథ్, రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లాలో అంగన్‌వాడీ ఉద్యోగులకు పని భారాన్ని పెంచిన ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మంగ, సీఐటీయూ నాయకుడు కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి ఐసీడీఎస్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌తో ఒకే పనిని అనేక సార్లు చేయాల్సి వస్తుందని వాపోయారు. దీంతో అంగన్వాడీలు పని ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్ పనిని తొలగించి భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శశికళ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో ప్రతిభ



ప్రశంస పత్రం అందుకుంటున్న అర్చన

దుబ్బాకటౌన్: తెలంగాణ సోషల్‌స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి సాంఘికశాస్త్రం ప్రతిభా పాటవ పరీక్షలో దుబ్బాక మండలం చీకోడ్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన సోమారపు అర్చన ప్రతిభ చూపింది. పరీక్షలో ప్రతిభ చూపి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించడంతో జిల్లా విద్యాధికారులు అభినందించి ప్రశంస పత్రం అందించారు. పాఠశాల హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు ఇస్తారి స్వామి తదితరులు అర్చనకు అభినందనలు తెలిపారు.

మైనర్ అపహరణ కేసులో వ్యక్తి అరెస్టు

పటాన్‌చెరు టౌన్: ఇంటర్ సెకండియర్ చదువుతున్న ఓ బాలిక(17)ను అపహరించిన యువకుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పటాన్‌చెరు పోలీసుల వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా కొండాపూర్ మసీదు బండకు చెందిన బాలిక గతేడాది అక్టోబర్ 5న అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు బాలికను వెతికి తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం బాలిక తల్లిదండ్రులు పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని అమ్మమ్మ వద్ద బాలికను ఉంచారు. ఈ క్రమంలో డిసెంబర్ 30న బాలిక మరోసారి అదృశ్యమైంది. రంగారెడ్డి జిల్లా బాలనగర్‌కు చెందిన బేగరి రవి కిరణ్ వద్ద బాలిక ఉన్నట్లు గుర్తించారు. రవికిరణ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

రేషన్ డీలర్‌పై విచారణ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని ఇబ్రహీంపూర్ రేషన్ డీలర్‌పై వచ్చిన ఆరోపణలపై సోమవారం అధికారులు విచారణ చేపట్టారు. డీలర్ జగదాంబ తమకు రేషన్ బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదని లబ్ధిదారులు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా జిల్లా పౌరసరఫరాల ఏసీఎస్‌ఓ నిత్యానందం, డీటీసీఎస్ సురేష్ కుమార్, డీపీఏ దేవరాజ్ తదితరులు గ్రామానికి వెళ్లి రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి, రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. విచారణలో అదనంగా బియ్యం ఉన్నట్లు గుర్తించి, నివేదికను అదనపు కలెక్టర్‌కు అందస్తామని తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట

- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర
- త్వరలో కొల్లూర్‌లో పోలీస్ స్టేషన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శాంతి భద్రతల పరిరక్షణకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. సోమవారం రాత్రి తెల్లాపూర్‌లో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు నూతన పెట్రోలింగ్ వాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగా పోలీస్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. త్వరలోనే తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి కొల్లూరులో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని అన్నారు.

నిరంతర పెట్రోలింగ్..

రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్‌ను పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. 24 గంటలు పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉండేలా చూస్తామని, ఫోన్ చేసిన వెంటనే 5నిమిషాల్లో చేరుకునేలా చూస్తామన్నారు. పెట్రోలింగ్ వాహనాల పర్యవేక్షణ చేస్తామని, వీటి పర్యవేక్షణకు ఒక ప్రత్యేక అధికారి కూడా ఉంటారని వివరించారు. క్రైమ్ జరిగే హాట్ స్పాట్లను గుర్తించి పెట్రోలింగ్ వాహనాలతో మానిటరింగ్ చేస్తామన్నారు. రాత్రి వేళ ప్రజలకు ఇబ్బందులు లేకుండా వీధి దీపాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, తెల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్లెపల్లి లలిత, ఏసీపీ కృష్ణ ప్రసాద్, సీఐ సంజయ్ కుమార్, ట్రాఫిక్ సీఐ సుమన్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి కృష్ణ, జాయింట్ సీపీ అవినాష్, మహంతి, కౌన్సిలర్లు లచ్చిరాం నాయక్, శ్రీశైలం, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోషియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

రోడ్డు నిబంధనలు పాటించాలి

- గజ్వేల్ ఏసీపీ రమేశ్
- వ్యాపారులకు కౌన్సెలింగ్

వర్గల్(గజ్వేల్): రాజీవ్ రహదారిపై వ్యాపారం ప్రమాదకరమని, రోడ్డు భద్రత నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని గజ్వేల్ ఏసీపీ మడత రమేశ్ హెచ్చరించారు. రోడ్డు భద్రత చర్యలో భాగంగా సోమవారం ప్రజ్ఞాపూర్ నుంచి వంటిమామిడి వరకు రాజీవ్ రహదారిపై ఇరు వైపులా రకరకాల వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. వ్యాపారులు రోడ్డును ఆక్రమించి దుకాణాలు పెట్టొద్దని, దీని వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. గతంలో రాజీవ్ రహదారిపై ఇలాంటి ప్రమాదాల్లో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి చనిపోతే ఆ కుటుంబం చిన్నాభిన్నం అవుతుందని అన్నారు. రోడ్డు పక్కన దుకాణాల్లో ఏదైనా కొనాలనుకునే వాహనదారులు వాహనాలను రోడ్డుకు దూరంగా నిలపాలని సూచించారు. వాహనదారులు, వ్యాపారులు రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.



వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించినట్లు పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 27 మంది పట్టుబడగా వీరిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చారు. విచారణ అనంతరం జడ్జి 23 మందికి ఒక్కొక్కరికి రూ.2వేలు, మరో ఇద్దరికి రూ.3వేల చొప్పున, మరో ఇద్దరికి రూ.5వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

నిప్పంటుకొని గడ్డి వాములు దగ్ధం



దగ్ధమైన గడ్డివాములు

దుబ్బాకరూరల్: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డి వాములు దగ్ధమైన ఘటన భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్న నిజాంపేట గ్రామంలో జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం ఆదివారం రాత్రి మెరుపుల స్వామిగౌడ్‌కు చెందిన మూడు గడ్డి వాములకు నిప్పంటుకుంది. మంటలు ఎగిసి పడడంతో చుట్టు ప్రక్కల వారు గమనించి ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశారు. అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో రూ.50 వేల నష్టం వాటిల్లింది. సోమవారం ఉదయం రెవెన్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



సయ్యద్ రహమతుల్లా (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఓ వ్యక్తిని ఆటో ఢీకొట్టగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం నెల్లూర్‌కు చెందిన సయ్యద్ రహమతుల్లా(48) పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండలో మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇంద్రేశం వైన్స్ సమీపంలో నడుచుకుంటు వెళ్తుండగా పటాన్‌చెరు వైపు నుంచి వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రహమతుల్లాను చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు. రామాయంపేట మండలం అక్కన్నపేటలో ఇంటి నుంచి మార్కెట్‌కు వెళ్లిన గృహిణి, పటాన్‌చెరులో ఓ యువకుడు అదృశ్యమయ్యారు.



సాయి కుమార్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భానూర్–బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమైనట్లు ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం పటాన్‌చెరు మండలం భానూర్‌కు చెందిన సాయి కుమార్ ఈ నెల 4న రాత్రి కుటుంబ సభ్యులతో కలసి ఇంట్లో పడుకున్నాడు. ఉదయం లేచి చూసే సరికి ఇంట్లో కనిపించలేదు. తెలిసిన వారు, బంధుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సాయికుమార్ సోదరుడు వినోద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్కనపేటలో గృహిణి



పల్లవి

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట గ్రామానికి చెందిన గృహిణి ముత్యం పల్లవి అదృశ్యమైనట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు. ఈ నెల 4న కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్లిన పల్లవి తిరిగి రాలేదు. తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో భర్త భాస్కర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో జీవిత ఖైదు

పటాన్‌చెరు టౌన్: ఇచ్చిన డబ్బులు అడుగుతున్నాడని మరో యువకుడితో కలిసి స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తికి సంగారెడ్డి జిల్లా జడ్జి జీవిత ఖైదు విధించారు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, పీపీ శ్రీనివాస్ రెడ్డి వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ భవానీపురం కాలనీకి చెందిన తమ్మిడిశెట్టి పవన్ స్నేహితుడు పితాని గౌతమ్(18) వద్ద అవసరం కోసం డబ్బు తీసుకున్నాడు. తీసుకున్న డబ్బును తిరిగి ఇవ్వాలని కోరడంతో గౌతమ్‌పై పవన్ కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో 2019 ఫిబ్రవరి 24న పవన్ మరో మైనర్ బాలుడితో కలసి గౌతమ్‌ను అమీన్‌పూర్ శివారు ప్రాంతానికి పిలిచి గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం శవాన్ని చెరువులో పడేశాడు. గౌతమ్ అదృశ్యంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చెరువులో మృతదేహన్ని గుర్తించారు. విచారణ చేపట్టిన పోలీసులు పవన్‌తో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. వీరిని సోమవారం కోర్టులో హాజరు పర్చగా జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి శశిధర్ రెడ్డి పవన్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల జైలు శిక్ష, కేసు పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించినందుకు గాను అదనంగా రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

జోగిపేటలో నలుగురికి..

జోగిపేట(అందోల్): హత్య కేసులో నిందితులైన నలుగురికి జీవిత ఖైదు విధిస్తూ సోమవారం సంగారెడ్డి ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జి ఎస్.శశిధర్‌రెడ్డి తీర్పునిచ్చారు. జోగిపేట సీఐ నాగరాజు వివరాల ప్రకారం 2017లో పుల్కల్ మండలం బద్రిగూడెం గ్రామంలో జరిగిన వ్యక్తి హత్యకేసులో నలుగురు నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. విచారణ అనంతరం నిందితులు బైరు ఆశయ, బైరు సంతోష, బైరు యాదయ్య, బైరు రాములుకు జీవిత ఖైదుతో పాటు రూ.వేయి జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలల పాటు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటఎడ్యుకేషన్: ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం అని జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో యోగా శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సోమవారం సర్టిఫికెట్లను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోర్సు పూర్తి చేసిన వారు సాధన చేస్తూ ఇతరులకు నేర్పిస్తూ రోగాలపై యోగాస్త్రం సంధించాలని సూచించారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కృపాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన తమ సంఘం ద్వారా సర్టిఫికెట్లు పొందిన వారు యోగా టీచర్లుగా రాణించవచ్చని, ఉద్యోగాల్లో రిజర్వేషన్ అవకాశం ఉందన్నారు. 45 రోజుల పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షకులు తోట సతీష్, సంధ్యల ఆధ్వర్యంలో శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ విశ్వనాథం, బీఆర్‌ఎస్ నాయకులు బుచ్చిరెడ్డి, రాష్ట్ర యోగాధ్యయన పరిషత్ సభ్యులు, శిక్షకుడు తోట సతీష్, అసోసియేషన్ బాధ్యులు అంజయ్య, తోట అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్ అయోధ్య రెడ్డి, డాక్టర్ గోపాలసుదర్శనం, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పొందిన అభ్యర్థులతో జెడ్పీ చైర్‌పర్సన్



మేళాను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ భారతీ దేవి

ఆకట్టుకున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళా

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళా నిర్వహించారు. 6 నుంచి పదో తరగతి విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల కళాకృతులను ప్రదర్శనకు ఉంచారు. మేళాను ప్రిన్సిపాల్ భారతీ దేవి, ఒకేషనల్ టీచర్ నీరజ, అధ్యాపకులు పరిశీలించి, ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

కొండాపూర్(సంగారెడ్డి): రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి,మోటారు వాహన చట్టం 2019ని సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి రైతు బజార్ వద్ద రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్రలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల మంది పైగా కార్మికులు రవాణా రంగంలో పనిచేస్తున్నారని, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలని కోరారు. ఈ నెల 3న ఖమ్మంలో ప్రారంభమైన జీపు జాత 11న సంగారెడ్డిలో ముగిస్తుందని, అనంతరం ఏర్పాటు చేసే సభలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రోజురోజుకు పెరుగుతున్న పెనాల్టీలు, చలాన్‌లతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, జిల్లా నాయకులు మధు, వెంకటేష్, మహేందర్, మల్లేశం, రాజు, గోపాల్, షబ్బీర్, శ్రీధర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిలు

దళితులపై దాడులను అరికట్టాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

గజ్వేల్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు చైర్మన్, సభ్యులను నియమించి దళితులపై దాడులను అరికట్టాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. దేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 192వ జయంతి సందర్భంగా సోమవారం గజ్వేల్‌లో ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అనంతరం దళిత సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. తెలంగాణలో మతోన్మాద శక్తులు దళిత, బహుజనులపై దాడులు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయని మండిపడ్డారు. సామాజిక విప్లవ ఉద్యమకారులు జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే బాటలో నడిచిన ఫాతిమాషేక్ అందరికీ ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు మైసరాములు, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి తుమ్మ శ్రీనివాస్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిప్పల యాదగిరి, జిల్లా నాయకులు బ్యాగరి వేణు తదితరులు పాల్గొన్నారు.



ఫాతిమాషేక్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత

హుస్నాబాద్: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను పోలీసులు గుర్తించి అందించారు. మండలంలోని పోతారం (ఎస్)కు చెందిన పరికరాల గణేశ్ పది రోజుల క్రితం హుస్నాబాద్‌కు వెళుతుండగా తన రూ.20వేల విలువ గల మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న తిప్పట్ల మొగిళికి ఫోన్ దొరకడంతో అతడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. ఫోన్‌ను పరిశీలించిన క్రైమ్ కానిస్టేబుల్ నరేశ్ ఫోన్ పోగొట్టుకున్న గణేశ్‌ను పిలిపించి అప్పగించారు. ఫోను తిరిగి అప్పగించిన మున్సిపల్ కార్మికుడికి, పోలీస్‌లకు గణేశ్ ధన్యవాదాలు తెలిపాడు.



యువకుడికి మొబైల్ అప్పగిస్తున్న పోలీస్‌లు

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్), తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-1740]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776250]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ. 18K ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888, 7569955551. [HA-786818]

■ Wanted Operators - (15), Salary-15k, ESI + PF+ Accomidation, Qly: 10+, Ph: 9110783252 [HA-779937]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుచున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మరో సైబర్ మోసం

- విద్యుత్ బకాయి చెల్లించాలంటూ ఫోన్
- ఖాతా నుంచి రూ.1.28లక్షలు చోరీ

కొండపాక(గజ్వేల్): విద్యుత్ బిల్ బకాయి పెండింగ్ ఉందంటూ ఫోన్ చేసిన సైబర్ నేరస్తులు అకౌంట్‌లో నుంచి రూ.1.28లక్షలు కొట్టేశారు. త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ వివరాల ప్రకారం కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన సురేశ్‌కు ఈ నెల 5న ఓ ఫోన్‌కాల్ వచ్చింది. తాను విద్యుత్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని, విద్యుత్ బకాయి చెల్లించకపోతే కేసు పెడతామని బెదిరించారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు బ్యాంక్ అకౌంట్ నంబరు చెప్పాలని కోరారు. నమ్మిన సురేశ్ బ్యాంక్ వివరాలను చెప్పడంతో సైబర్ నేరగాళ్లు తొలుత రూ.44వేలు, మరోసారి రూ.84 వేలు చోరీ చేశారు. అనుమానం వచ్చిన సురేశ్ విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

14 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లో మాజీ సర్పంచ్ చెన్నయ్యగారి నర్సింలు స్మారకార్థం ఈనెల 14 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు చక్రపాణి సోమవారం తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 13వ తేదీ సాయంత్రంలోపు ఎంట్రీ ఫీజు రూ.999 చెల్లించి, పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అదేరోజు సాయంత్రం డ్రా ఉంటుందని, మొదటి బహుమతి రూ.22,222, ద్వితీయ బహుమతి రూ.11,111లను నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 96185 11408, 94404 60841 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వాలీబాల్, షటిల్..

జాతీయ యువజన క్రీడోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్, షటిల్, చెస్ టోర్నమెంట్‌ను ఈనెల 11 నుంచి నిర్వహించనున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఆసక్తి గల యువకులు జట్ల పేర్లను పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఎంట్రీ ఫీజు లేదని, ఈనెల 10న సాయంత్రం ఆరు గంటలకు డ్రా తీస్తామని తెలిపారు. వివరాలకు 91770 97659, 96188 65635 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

జహీరాబాద్ టౌన్: మండలంలోని హోతి(బి) గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. పొలాల వద్ద ఏర్పాటు చేసేందుకు రైతులు ఇటీవల కొత్త ట్రాన్స్‌ఫార్మర్ తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని కేబుల్ తీగలు, ఆయిల్ చోరీ చేశారు. ఘటనపై రైతులు జహీరాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆహార నిబంధనలు అతిక్రమించొద్దు

ఆహార తనిఖీ జిల్లా అధికారి కృష్ణమూర్తి

దుబ్బాకటౌన్: ఫుడ్ సేఫ్టీ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆహార తనిఖీ జిల్లా అధికారి కృష్ణమూర్తి హెచ్చరించారు. సోమవారం దుబ్బాక పట్టణంలో మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డితో కలిసి పలు బిర్యాని సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బిర్యాని సెంటర్లలో నిల్వ ఉంచిన మాంసం, ఆహారాన్ని గుర్తించి చెత్తబుట్టలో పడవేశారు. రసాయనాలతో కూడిన కలర్ కలిపిన మాంసం, ఆహారపదార్థాల నిల్వ ఉంచడంపై సెంటర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు బిర్యాని సెంటర్ల నిర్వాహకులకు రూ.5వేలు, ఇద్దరికి రూ.3వేల చొప్పున జరిమానా విధించారు. రసాయనాలతో తయారు చేసిన కలర్స్‌తో హోటల్స్‌లో ఆహార పదార్థాలు తయారు చేస్తే చర్యలు తప్పవని అన్నారు. నిల్వ ఉంచిన మాంసంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతారని ఎప్పటికప్పుడు నిల్వ ఆహారాన్ని తొలగించాలని నిర్వాహకులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డి మాట్లాడుతూ నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్లాస్టిక్ ఉత్పత్తులను వాడినట్లు తెలిస్తే జరిమానాలు విధిస్తామని తెలిపారు. తనిఖీల్లో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దిలీప్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



దుబ్బాకలో బిర్యాని సెంటర్ నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికారులు

ఆయిల్ దుకాణాల్లో తనిఖీ

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని పలు ఆయిల్ దుకాణాల్లో సోమవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తనిఖీలు చేపట్టారు. కొద్ది రోజులుగా కల్తీ వంట నూనె అమ్ముతున్నారనే ఆరోపణల నేపథ్యంతో తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించాలి. లైసెన్స్ లేకుండా అమ్మకాలు సాగించొద్దని నిర్వాహకులకు సూచించారు. అనంతరం కొన్ని దుకాణాల నుంచి పరీక్షల నిమిత్తం వంట నూనె శాంపిళ్లను సేకరించారు.



హుస్నాబాద్ పట్టణంలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి